31

# వెలుగు-చీకటి-వెలుగు

[మనుష్యుల లోపల గులాబీల పొదలూ వుంటాయి. మంచి గంధపు చెట్లూ వుంటాయి.

అందమైనది కదా అని గులాబీని కోయబోతే ముళ్ళు తగిలి నెత్తురు కార వచ్చు. అంత ఆకర్షణీయంగా లేదని దూరంగా వెళ్ళినా పరిమళాల హస్తాలుజాచి కౌగలించుకుంటుంది మంచి గంధం.

ముళ్ళని తప్పించుకుని గులాబీని కోయడం – బ్రతుకుభాష వ్యాకరణం నేర్వడమే.

ఈ విషయాన్ని ఒక ఇల్లాలియొక్క రెండు—అనుభవాలలో ఇమిడ్చిన కథ ఇది. దీనికి ప్రేరపణ స్వానుభవమే.

మూడేళ్ళ తర్వాత ఈ నాడీ కథను చదివితే మొదటి పేరాలు కొన్ని అవ సరమేనా అనిపించింది మరి!]

"ఇదేమిటండీ, ట్రెయిన్ మళ్ళీ మనం వచ్చినవైపే పోతున్నట్లుందే—?"

"అంతేకాదమ్మాయి! ఇంజనుకూడా ఇటుప్రక్కకొచ్చింది" అని మొహంమీద అర కిలోగ్రాము 'సీరియస్‌నెస్' పూసుకున్నాడు అచ్యుతరావు.

అడిగినకొద్దీ వేళాకోళమేగాని ఈయన దగ్గరనుండి జవాబురాదని, కిటికీలోంచి శ్రద్ధగా బయటికి చూడసాగింది వసంత.

కాలానికి ప్రతినిధుల్లా నిలబడిన స్థంభాలేవో గబగబ గతంలోకి వెళ్ళిపోతున్నాయి. నిన్న. నేడు, రేపుల మధ్య ఇరుక్కునివున్న ప్రాణికోటికి ఉదాహరణగా చెట్లు, మోడులు, మొక్కలు ఆ స్థంభాల మధ్య మధ్య కనబడుతున్నాయి. గభుక్కున... అవతలివైపు ఇంకోజత రైలుపట్టాలు కనిపించాయి.

వసంత కనుబొమలు ముడిపడ్డాయి; విడిపడ్డాయి. ఆ అదేం, ఇదిగో ఇందాక వార్ధా స్టేషను రావడానికిముందుగా వచ్చిన ఆ చిన్న కాలువమీది బ్రిడ్జి. అదీ సంగతి!

వెనక్కుతిరిగి "ఎం ఏం!" అని వెక్కిరించింది వసంత.

"వెక్కిరింతలోకూడా వెగటని పించనిదే అందము!" అని నిర్వచించాడు అచ్యుతం.

"ఈ రంగంలో భట్రాజు పాత్రలు నిషిద్ధం... అంచేత ప్రస్తుతాంశం వినండి... అడిగినదానికి సమాధానం మీరు

చెప్పకపోతే నాకు తెలియదనుకున్నారుకదూ. నేనే తెలుసుకున్నాను లెండి."

"ఏమి తెలిసెను" అని రహస్యంగా అడగబోయిన అచ్యుతం మొహాన్ని దూరంగా తోసేసి చుట్టూ చూచింది వసంత.

పాప నిద్దర్లోనే నవ్వింది.

"భామినీ! ఇది 'కుపే' అనబడు పహుపుల పెట్టె రాజము; రైలుబండిలో మన చిన్న రాజ్యము—" అన్నాడు అచ్యుతం బదలీ తెచ్చిన బత్తెం ఇచ్చిన బలంతో.

"అయ్యో! అవన్నీ ఆపి ఇది వినండి... ఈ రైలెందుకు వెనక్కి వెళుతుంది—అని అడిగితే 'హి—ఈ మాత్రం తెలీదా-' అన్నట్లు మొహం పెడితిరే! నేనే జవాబు కనుక్కున్నాను లెండి—"

"సెల్ఫ్ మేడ్ మనిషివి!... హా! ఏదీ—"

"ఛీ..." అని చెంపమీద చేతినుంచుకుని— "మనం వచ్చిన రైలుట్రైను. అదిగో అవతలవుంది చూడండి. వార్ధా నుండి మనం వెనక్కి అనగా దక్షిణానికి వచ్చినట్లు వచ్చి—క్రమంగా వంపు తిరిగి ఉత్తర దిశలో వెళ్తున్నాం ఇప్పుడు—"

అని హోయల్—నర్లీకర్ లంత తీవితో, ధీమాతో చూచింది వసంత.

'అందం ఏం చేసినా అందంగానే వుంటుంది—' అనుకుని కొద్దిగా మూర్ఛిల్లి తేరుకున్నాడు అచ్యుతం.

అటువంటి అందంతో ఏమి చేయవలె?

ఆడుకోవలే!

...అనేక గోళాలను. అందులోని లోకాలనూ. వాటిలోని జీవులనూ. వారిలోని రాగద్వేషాలనూ—మోస్తున్న విశ్వంలాగున్న గ్రాండ్ట్రంక్ ఎక్స్‌ప్రెస్ రయ్‌మని వెళ్ళిపోతూంది.

*  *  *

"రెండో సెక్టార్లో సుందరి అని వుంది—తెలుగావిడే—పాల డిపోదగ్గర పరిచయం అయింది...కలుపుగోలుగా మాట్లాడింది" అని తెలిపింది వసంత.

"గుడ్, వెరీగుడ్—ఇక్కడికొచ్చేక నువ్వు డేల్ కార్నీ'ని చదివావా—"అని ప్రశ్నించాడు వాళ్ళాయన.

ఆయన సెక్రెటేరియట్‌లో పెద్దతరగతి గుమాస్తా. అప్పుడే వచ్చాడు ఆఫీసునుండి అతడి అలసట అంతా వసంత కళ్ళల్లో కరగిపోయింది.

—"చదవలేదు ... ఏవిటది?" అని అడిగింది వసంత.

"స్నేహితులను ఎలా తయారు చేయడం. చేసిం తర్వాత చెడిపోకుండా నిలవ్వుంచుకోవడం ఎట్లాగు—అన్న అంశాలమీద—వేదంలాంటి పుస్తకం రాశాడు కార్నీ! రెండు కోట్ల ప్రతులు అమ్ముడయ్యాయి ..."

"నేను ఇంగ్లీషు పుస్తకాలు చదవలేనని ఎగతాళి చెయ్యక్కర్లేదు—" అని కాఫీ గ్లాసక్కడపెట్టి—వంటింట్లోకి విసవిసా వెళ్ళింది వసంత. ఆమె వెంటనే వెళ్ళాడు అచ్యుతం..

—ఆ వంటిల్లు అన్నది—మన తెలుగు దేశంలో వున్న వంటిల్లులా విడిగా, వేరుగా, ప్రత్యేకంగా స్వతంత్రంగా ఒక చిన్న రిపబ్లిక్‌లా వుంటుందీ అనుకుంటే మీరు తప్పులో కాలు వేశారు. ఢిల్లీలో కాలు వేయలేదు అన్నమాట. అంటే ఢిల్లీ ఇళ్ళల్లో వంటగదు లుండవనికాదు. మూడడుగుల వెడల్పు. అయిదారడుగుల పొడవుతో. ఏ రొట్టెముక్కో కాల్చుకోవడానికి వీలుగా వుంటుంది వంటగది. అంతేగాని—పచ్చడి బండ, రుబ్బురోలు, నీళ్ళ గంగాళం, రెండుకుంపట్లు, ఒక స్టవ్. నాలుగు చాటలు ఒక బియ్యం డబ్బా ఇవన్నీ అమర్చుకుని—కూర పప్పు. వేపుడు. పచ్చడి, చారు చేద్దామనుకుంటే ఇబ్బందే మరి! ఈ మాత్రం వంటగదే అయినా ఇంకో గది కలిపితే—నెలకు వందా పది అయినా ఇవ్వాలి అద్దె ?? ఆ! అవును! వందా పదియే... ఇందులో అచ్చుపొర

భాటేవీలేదు ... పైపెచ్చు అవి రూపాయలు! అందుచేత వందా యాభయ్యో రెండువందలో జీతం వచ్చేవాళ్లు—వందా పదో, వందా పాతికో అద్దెక్రింద ఇచ్చినేసి. పొట్టి శ్రీరాములుగారి 'డైయట్'లో వుండ వచ్చుననుకోండి? కాని ఆ అయిడియా అంతగా నచ్చనివాళ్ళందరూ ఏ రామకృష్ణపురంలోనో. లోడి కాలనీలోనో మరోచోటనో ప్రభుత్వంవారు కట్టి ఇచ్చిన ఇళ్ళలో—ఆ ఇల్లు ఎవరికి కేటాయించారో వారి దాక్షిణ్యం కొద్దీ—ఒక్క గదో, గదీ వరండానో తీసుకుని; నల్భై యాభై రూపాయలు యిచ్చి 'వసతిని పంచు' కుంటారు,

—అట్లాంటి ఏర్పాటే అచ్యుతం దంపతులది. ఒక గదిలో—కర్టెను కవతలది వంటగది. ఇవతలది మిగతా గదులు. అంచేత చెప్పొచ్చిందేమంటే వసంత వెంబడే అచ్యుతం కర్టెను కివతలనుండి అవతలికి వెళ్ళినవాడాయెను.

ఈలోగా పాప ఆటలు ముగించి ఇంటోకి వచ్చింది. అంతట ఆరోజు మీాద అవనిక జారింది.

నెలరోజుల తర్వాత ఇంకోరోజు సాయంకాలం అచ్యుతం ఇంటికొచ్చేసరికి వళ్ళ పాప రామకృష్ణపురం తాలూకు మట్టితో ఆడుకుంటున్నది. దాని నెత్తుకుని ముద్దెట్టుకుని— 'ఆయ్! చిన్న బిడ్డను అట్లా వదిలేస్తే అది మెయిన్ రోడ్డు

మీదకెళ్ళితే ఏమయిపోను—' అని చెకామకా కోప్పడ దామని లోపలికి వెళ్ళాడు అచ్యుతం

నుదిటిమీద చెయ్యి పెట్టుకుని కూచున్న వసంతి కన పడింది. అతడిని చూచి, లేచి వెళ్ళి కాఫీ ఫ్లాస్కు అందిం చింది. ఆమె ఈ సాయంకాలం మొహం కడుక్కున్నట్లులేదు. చేతి మీద ఏదో ఎండిన పిండి మరకలు. దగ్గరగా చూచాడు అచ్యుతం. బుగ్గల మీద గీతలు! కళ్లు...

"ఏమిటయింది వసంతా!" అని ఒక చేత్తో పాప నెత్తు కునే, ఇంకొక చేతి చుట్టులోకి ఆమెను తీసుకున్నాడు. ఆమె మాట్లాడనేలేదు. అతడి భుజంమీద మొహం ఆన్చింది ఆమె. అతడి చొక్కా వెచ్చగా తడిసింది.

అయిదు నిముషాల తర్వాత ముక్కు చీదుకుంటూ ఆమె దూరంగా జరిగింది. ఫ్లాస్కుని, గ్లాసుని అతడికి అందించి బాత్ రూంలోకి వెళ్ళింది.

పాప నెత్తుకుని గుమ్మంలోకి వెళ్ళి నిల్చున్నాడు అచ్యుతం.

దుఃఖం వరదవంటిది. ఎంత ప్రేమ అయినాసరే ఆ వర దకు ఆనకట్ట వేయలేదు. లాలన ఆవరదను ఉధృతం చేస్తుందే కాని శమింపచేయలేదు. బరువంతాపొంగి బయటికి వెళ్ళి

పోయింతర్వాత నిజానికి మాటలొస్తాయి—అన్నది అయిదేళ్ళ వైవాహిక జీవితంలో అచ్యుతానికి తెలిసిన నిజాల్లో ఒక్కటి.

అయినా—

పువ్వులాటి మనసును ఎవరు—ఎందుకు నొప్పించారు—అని అతడి హృదయం గిలగిల లాడింది.

పదిహేను నిముషాల తర్వాత వసంతం వచ్చింది. శుభ్రంగా వుంది ఆమె మొహం. కాని కొద్దిగా జేవురించి నట్లుంది. నుదిటిమీది బొట్టు నిండుగా కన్పించింది.

"మీకు కాఫీకూడా ఇవ్వలేదు నేను"—అని నొచ్చుకుంది.

"ఫరవాలేదు వసంతా! ఫ్లాస్కు, గ్లాసు ఇస్తే ఇచ్చి నట్లుకాదూ" అని అచ్యుతం ఎదురు చూడ సాగాడు.

దూరంగా రోడ్డుమీద అప్పుడే బస్సుదిగిన దేహాలు కొన్ని కాళ్ళీడ్చు కుంటూ పోతున్నాయి.

ఉన్నట్లుండి మధ్యనుండి చెప్పనారంభించిది—"రుబ్బు రోలు పది రూపాయలెట్టి కొనుక్కోలేరా—' అని దెప్పి పొడిచి-ఛీ ఏం మనిషో—" ఒక్కక్షణం వసంత కళ్లు ఎర్రగా అయ్యాయి.

"ఇడ్లెన్నాని కాస్త పప్పు బియ్యం నానవేశాను. అవి

రుబ్బుకోద్దామని మధ్యాహ్నం రెండో సెక్టారుకు వెళ్లాను. సరే. అందావిడ నేను వద్దంటున్నకొద్దీ రోలు. పాత్రలూ కడిగి తుడిచింది. రుబ్బుతూ—మధ్య పాపని ఆడిస్తూ—ఆవిడతో మాట్లాడుతుంటే. వడియాలు ఎండ ప్రసక్తి వచ్చింది.

"ఇంత ఎండలో పడివచ్చారు పాపం అంది."

"అవునండి మధ్యాహ్న వేళే కాస్త తీరిక అన్నాను."

"ఓ పదిరూపాయలెట్టి రోలుకొని పడేసుకుంటే ఈ అలసట వుండదు."

"మాకు బెజవాడలో ఒకటి రెండు రోళ్లున్నాయి. అవన్నీ తెస్తే ఉంచుకోవడానికి చోటుకూడా వుండదని పోట్లాడారు ఆయన అన్నాను."

"ఆ...! మగవాళ్ళంతేలెండి —— నాకేమో, మీ కుంపటోసారిస్తారా. మీ టిఫిన్ ప్లేట్లు అవసరంవుంది అ టూ ఇంకోరింటికి వెళ్ళడం మహారోత—"

"నేనేమీ మాట్లాడలేదు."

"ఇంతకు ముందు మాణిక్యాంబ అని ముందు సెక్టార్లో వుండేవారు. ఆవిడ అన్నం తెప్పేలా కొకరింటికి. విసనకర్ర కింకోరింటికి, నీళ్ళబిందెకు మరొకరింటికి, ఇలా పరుగెడుతుండేది. ఆవిడవున్న నాలుగేళ్లూ కాపురం చేసిందనుకోండి—

వస్తువులువున్నా లేక పోయినా సంసారం జరుగుతుందను కోంశి, అయినా... అన్నది ఆమె."

—ఈ కథలోని డైలాగులన్ని విని "ఎవరు—మీ ఫ్రెండు సుందరేనా ఈ కథకు నాయకి-" అని నవ్వాడు అచ్యుతం.

"నవ్వకండి-ఆ ధోరణి వింటుంటే ఒళ్లు మండిపోయింది. ఛీ... బుద్ధిలేని దాన్ని ఎందుకు వెళ్లాను అన్పించింది."

"పిచ్చిపిల్లా !పాప నొకదాన్ని వేసుకుని, పప్పులూ గిన్నెలూ మోసుకుని ఆ ఎండలో పడిపోయి రుబ్బుకు రాక పోతే ఏవిటి చెప్పు-"

"రేపేమో సెలవురోజు. ఇంటిదగ్గరుంటారు. మీకు ఇడ్డెన్లు ఇష్టంకదా అని" వసంత అంటుంటే అచ్యుతం కళ్ళ ల్లోకి నీళ్లు వచ్చాయి. లేచి లోపలికి వెళ్లాడతడు. పాపని నడి పించుకుంటూ వసంత అనుసరించింది.

"కాని ఈ ఒక్క దినంలో ఆమె మీద అభిప్రాయం మార్చుకున్నావా"

"ఏమీ కాదు—ఇది వరలో రెండు మూడు మాట్లే లాగే నోటికి వచ్చినట్లు మాట్లాడింది. పెద్ద తానేదో మహా రాణి అయినట్లు."

"మరి నాకు తెలియదే."

"ఎందుకీ చిన్నచిన్న వాటిని మీకుచెప్పడం—అని వూరుకున్నా. రెండువారాల క్రింద ఒక మధ్యాహ్నం పాప వాళ్ళింటో ఒక ఖాళీసీసా పగలకొట్టింది. దానిమీద నాకావిడ పిల్లల పెంపకం గురించి అరగంట లెక్చరిచ్చింది. తనకేమో పెళ్ళయి పదేళ్ళయినా పిల్లల్లేరు! ... నేను వెంటనే మనింటికివచ్చి అట్లాంటిదే ఖాళీసీసా ఇవ్వబోతే, ససేమిరా వద్దన్నది. కాని నాలుగు రోజుల తర్వాత ఎదురింటి గుప్తా పెళ్ళాంవచ్చి అడిగింది—"ఏవమ్మా—మీ పాప సుందరమ్మగారింట్లో గంగాజలం వున్నసీసా పగలగొట్టిందటగా—" ... ఆవిడగారి ప్రచారము అన్నమాట ఇది ... తీరా చేస్తే వెధవ ఖాళీ సీసాకోసం-ఇట్లా అబద్ధాలు చెబితే ఆవిడకు ఒరిగిందేవిటో—మనుషులు ఇట్లా ఎందుకుంటారో—"

"ముళ్ళు ముళ్ళులా ఎందుకుంటాయి—అంతే! నువ్వు ఆమెతో కాస్త జాగ్రత్తగా మెలగాలి—"

"ఏం మెలగక్కర్లేదు. తోటి తెలుగుమనిషికదాఅని వెళ్తానుకానీ—నాకేం వూసుపోకనా? ఆవిడ గొప్పేదో ఆవిడనే దాచుకోనివ్వండి—వచ్చిన క్రొత్తలో ఒక శుక్రవారం ఆకుపచ్చ పట్టుచీర కట్టుకుని వాళ్ళింటికి వెడితే—ఎవరు పెట్టారు ఇది?" అంది. మావారు మదరాసులో కొన్నారు అన్నాను. "ఇన్

స్ట్రాల్ మెంటు పద్ధతిలో కాబోలు" అంది. ఎంతపొగరో మనిషికి.

"శుక్లపక్షంలో స్నేహమూ, కృష్ణపక్షంలో విరోధమూనా?"

"పై పిచ్చి ఇంటర్ దాక ఏడిచిందట. దేన్ని చూచుకునో అంత అహంకారం! ఛీ ఛండాలపు మనుష్యులు. ప్రశాంతంగా బ్రతకనివ్వరు" అని ముగించింది వసంత.

ఒక్కొక్క నిజాన్నే తెలుసుకోవడం మంచిదేకాని, ఒక్కనిజమే అందరియెడల, అన్నివేళల వర్తించదన్న నిజం కూడా తెలుసుకోవాలి—అనుకున్నాడు అచ్యుతం.

ఆ మరుసటి ఆదివారం ప్రొద్దున్న 'రాను మొర్రో' అన్న వసంతను బలవంతాన ఒప్పించి-తన సెక్షన్ నాఫీసరు విశ్వేశ్వరంగారింటికి తీసుకువెళ్ళాడు అచ్యుతం.

"రండి రండి" అని ఆహ్వానించింది విశాలాక్షమ్మ. లావుపాటి మనిషి తెల్లగావుంది. నెరిసినజుత్తు అందంగావుంది. పెద్దబొట్టు. రవ్వల దుద్దులు.

విశ్వేశ్వరావుగారు అచ్యుతరావు కబుర్లు చెప్పుకున్నారు. విశాలాక్షమ్మ వంటింట్లో పీటవేసి కూచోపెట్టి మాట్లాడింది. అవి ఇవి అడిగింది. ఢిల్లీలో ఆడవాళ్ళంటే బెదురుపుట్టిన ఆత్మ తన అపనమ్మకాన్ని త్వరగా వీడలేదు.

పదకొండయింది. వసంత లేచింది.

"ఇది చాలా బాగుంది. ఈ మిట్టమధ్యాహ్నం వెళ్ళి ఏం పంచుకుంటారు? ఈపూట ఇక్కడ భోంచేసి సాయంత్రము వెళ్ళండి" అంది విశాలాక్షమ్మ.

"వంటవండే వచ్చానండి" అంది వసంత. ఎత్తువెక్కనేల అక్కడనుండి తోయించుకోనేల అని.

"వంట వండితే సాయంకాలం తినండమ్మా! ఏమండీ అచ్యుతరావుగారూ. అమ్మాయికి చెప్పండి... అందులో పాప ని దపోతూంది కూడాను. మా అమ్మాయి వనజ 'భీష్మ' సినిమా చూడ్డానికి వెళ్ళింది వస్తుంది. దానికి పిల్లలంటే ప్రాణం"

భోజనాలయ్యాయి.

మధ్యాహ్నం కాఫీలయ్యాయి.

సాయంకాలం అచ్యుతరావు వసంత సెలవు తీసుకున్నారు.

"మీరందరూ వచ్చే ఆదివారం తప్పక మా ఇంటికి భోజనానికి రావాలి" అంది వసంత.

"అట్లాగే వస్తాము. కాని వచ్చే ఆదివారం వీలుపడదేమో ఆ తర్వాతి ఆదివారం వస్తాము."

"నిజంగా?"

"నిజంగానే ముందురోజు ఈయన మీ వారితో చెబుతాన్నగా"

"తప్పకుండా వనజతో రండి—ఏం వనజా!" అంది వసంత.

"అందాక పాపను ఇక్కడ వుంచెయ్యకూడదూ" అంది వనజ నవ్వుతూ.

బస్సులో పడ్డారు వసంతా; అచ్యుతరావూ. పాప—ప్రపంచాన్ని తన క్రొత్తకళ్ళతో చూస్తూవుంది.

"ఈమె ఎంత మంచిదనీ" అంది వసంత.

"సుందరిని గురించి మొదట ఇలాగే."

"ఛీ! ఈమె పద్ధతే వేరు. ఎంత ఆప్యాయతతో మాట్లాడిందనీ. పనిమనిషివుందా. పాలకు ఏం చేస్తున్నారు అన్నీ అడిగింది. రోలుందా అంటే లేదన్నాను. మా ఇంట్లో రెండున్నాయమ్మా నీకాక్కవలసిందొక్కటి తీసుకెళ్ళు అంది."

"ఓహో అదీ సంగతి! రోలు ఆడవారి మంచితనానికి గీటురాయి!! అవునా"

"అహా; దివ్యంగానూ... మంచివారి మంచితనమయినా మరుసువారి మరుసుతనమయినా కనుక్కోడానికి రోలుచాలు"

"హియర్ హియర్. ది సుందరి లా ఆఫ్ వుమెన్స నేచర్."

"ఓయ్... ఇది వినండి... విశాలాక్షమ్మ ఎం. ఎస్. సి. పాసయిందట. ఏదో లేబరేటరీలో పనిచేస్తూ, ఆరోగ్యం సరిలేక మానేశారట ఇది తెలుసా మీకు?"

"ఆ ఇంకోటికూడా తెలుసు. విశాలాక్షమ్మ చక్కగా వీణ వాయిస్తారట!"

"వీణ వాయిస్తుందా!" ఆశ్చర్యపోయింది వసంత.

"వచ్చే ఆదివారం కృష్ణ గానసభలో ఆమె వీణ కచ్చేరి వుందిట ఏమనుకున్నావో."

"మనుష్యుల్లో ఎంత మంచి వాళ్ళున్నారండీ" అంది వసంత కిటికీబయటవున్న పాపచేతిని లోపలికి తీస్తూ.

"మరే... ఉదాహరణకు నేను—చూడు!"

"అయ్యో పాపం!" అని నోరుతిప్పింది వసంత. అది బస్సు గనుక వంగి పాపాయిని ముద్దుపెట్టుకున్నాను అచ్యుతం."

("సైనిక సమాచార్"—64)